నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | బుధవారం 14 ఫిబ్రవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఐనాల సైదులు

# జేఈఈ మెయిన్స్‌లో సీవోఈ విద్యార్థుల ప్రతిభ

బెల్లంపల్లి రూరల్, ఫిబ్రవరి 15 : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ ఫలితాల్లో బెల్లంపల్లి సీవోఈ విద్యార్థులు ప్రతిభ చూపారు. 8 మంది విద్యార్థులు ఉత్తమ పర్సంటైల్ సాధించారు. దుర్గం చరణ్‌తేజ్ 85.04 పర్సంటైల్‌తో కళాశాల టాపర్‌గా నిలిచారు.తీగల అశ్రిత్ (83.64), దుర్గం అఖిర నందన్(75.50),లింగంపల్లి అంజి (63.39), ఆకుతోట శివసాయి (58.17), కామెర విష్ణుచైతన్య( 55.16), పుట్టల శివ(54.92), కొందుకూరి దిలీప్ (50.11) తనదైన ప్రతిభ చాటారు. మరో ఐదుగురు విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్డ్ పరీక్షకు అర్హత సాధించే అవకాశమున్నట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆర్సీవో కే.స్వరూపారాణి ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు. మంగళవారం బెల్లంపల్లి సీవోఈలో ప్రిన్సిపల్ సైదులు, ఉపాధ్యాయులు ప్రతిభ చూపిన విద్యార్థులను పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.



భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్‌లు

# నేడే వసంత పంచమి

### వేలాదిగా తరలిరానున్న భక్తులు

బాసర, ఫిబ్రవరి 13 : నేడు(బుధవారం) వసంత పంచమి సందర్భంగా అధికారులు ఏర్పాట్లను ఘనంగా చేశారు. భక్తులు తమ చిన్నారులకు అక్షర శ్రీకారాలు చేయించడానికి వేలాదిగా తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో క్యూలైన్‌లు, అక్షరాభ్యాస టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. ముథోల్ సీఐ మల్లేశ్, బాసర ఎస్సై గణేశ్‌ల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించనున్నారు.



సరస్వతీ అమ్మవారు

# జంగ్ సైరన్



చలో నల్లగొండ సభలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

## ఉద్యమ సారథి కేసీఆర్‌కు జనం జేజేలు

### చలో నల్గొండ బహిరంగ సభపై అంతటా ఆసక్తి

### కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను వివరించిన బీఆర్ఎస్ అధినేత

నిర్మల్, ఫిబ్రవరి 13(నమస్తే తెలంగాణ) : సర్జరీ తర్వాత పూర్తిగా కోలుకొని మళ్లీ జనం మధ్యకు వచ్చిన బీఆర్ఎస్ అధినేత, ఉద్యమ సారథి కేసీఆర్‌కు జనం జేజేలు పలికారు. మంగళవారం సాయంత్రం నల్గొండ జిల్లా కేంద్రంలో కృష్ణా నది జలాల్లో తెలంగాణ వాటా కోసం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు కేసీఆర్ హాజరు కావడంతో ఆయన ప్రసంగాన్ని వినేందుకు చాలా మంది ఆసక్తి చూపారు. బహిరంగ సభా కార్యక్రమాన్ని టీవీల్లో లైవ్ ద్వారా తిలకించారు. కేసీఆర్ సుదీర్ఘ ప్రసంగాన్ని ప్రజలు శ్రద్ధగా విని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కేసీఆర్ ఉద్యమ కాలం నాటి తరహాలో కృష్ణా జలాల సమస్యపై సుదీర్ఘంగా ప్రసంగించి కాంగ్రెస్ ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపారని సంతోషం వ్యక్తం చేశారు. అంతేకాకుండా కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని పట్టించుకోకుండా కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేలా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాలు చేయాలన్న కుట్రతో చేస్తున్న రాద్ధాంతాన్ని విపులంగా తెలిపారు. ప్రతి అంశంపై క్షుణ్ణంగా, గణాంకాలతో కాంగ్రెస్ కుట్రలను ఎండగడుతూ చేసిన ప్రసంగం వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా పాలించాలన్న అంశాన్ని కూడా వివరించారు. పెద్దన్న తరహాలో సీఎం కేసీఆర్ ప్రసంగించడంపై టీవీల్లో ఈ సభను తిలకించిన వారంతా ఆయన గొప్పతనాన్ని అభినందించడమే కాకుండా, అడుగడుగునా నీరాజనం పలికారు. నల్గొండ సభ మరోసారి కేసీఆర్‌కు ఉన్న ప్రజా బలాన్ని, అలాగే ఆయన ప్రసంగంలోని వాడీవేడీని ప్రతి ఒక్కరు గుర్తించారు.

### మరో ఉద్యమానికి శ్రీకారం



*ఆసిఫాబాద్, ఫిబ్రవరి 13 : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ సాక్షిగా కృష్ణా జలాల పంపిణీ విషయపై అబద్ధాలు చెబుతూ ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నది. కృష్ణా జలాల పంపిణీ చట్ట ప్రకారమే జరిగింది. కేసీఆర్ సర్కారులో నీళ్లకోసం ఆంధ్ర ప్రభుత్వంతో ఎన్నోసార్లు గొడవ జరిగిన విషయం ప్రజలందరికీ తెలుసు. కృష్ణ బేసిన్‌పై పోలీస్ పహారా మధ్య నీటి విడుదల చేసిన సందర్భాలు ఉన్నాయి. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం చేతగాక నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నది. అందుకే బీఆర్ఎస్ అధినేత నీళ్లకోసం మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.*

**- కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే**

### రైతులకోసం పోరాడే ఏకైక వ్యక్తి కేసీఆర్



*మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 13 : నల్లగొండలో నిర్వహించిన బీఆర్ఎస్ సభ విజయవంతమవ్వడంతో కాంగ్రెస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. రైతుల పక్షాన పోరాడే ఏకైక వ్యక్తి కేసీఆర్ అని రైతాంగానికి అర్థమైంది. కృష్ణాజలాలను కాపాడడం కేవలం కేసీఆర్‌తోనే సాధ్యమని వారికి తెలుసు. కాంగ్రెస్ నాయకులు మాయమాటలు చెప్పి పబ్బం గడుపుకోవడం తప్ప.. చేసిందేమీ లేదు. పదేళ్ల పాలనలో కేంద్రం కుట్రలను కేసీఆర్ అడ్డుకున్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చీ రాగానే కృష్ణా జలాలను కేంద్రానికి అప్పగించి రైతాంగ ప్రయోజనాలను తాకట్టు పెట్టింది. అసెంబ్లీలో మాజీ మంత్రి హరీశ్‌రావు నిజాలను పూసగుచ్చినట్లు వివరించారు. అయినా మొండిపట్టుతో కాంగ్రెస్ మేడిగడ్డ సందర్శన నాటకం మొదలు పెట్టింది. ఇకనైనా కక్షసాధింపు చర్యలకు పాల్పడడం మానేసి రాష్ట్రం కోసం, ప్రజల బాగోగుల కోసం పని చేస్తే మంచిది.*

**- దివాకర్‌రావు, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే**

### కాంగ్రెస్ కుట్రలను ప్రజల ముందుంచారు..



*కేఆర్ఎంబీపై కేంద్రంతో కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్గతంగా చేసుకున్న ఒప్పందం బహిర్గతమైంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఇరిగేషన్ మాజీ మంత్రి హరీశ్‌రావ్‌లు వెంటనే స్పందించి కాంగ్రెస్ కుట్రలను ప్రజల ముందుంచాలన్న ఉద్దేశంతోనే ఈ రోజు నల్గొండలో భారీ బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభకు భయపడే కాంగ్రెస్ నాయకులు, ముఖ్యమంత్రి హడావుడిగా కేఆర్ఎంబీకి వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. నల్గొండలో కేసీఆర్ సభ పెట్టిన వెంటనే, ఎమ్మెల్యేలతో కలిసి మేడిగడ్డ సందర్శన అంటూ షో చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా నల్గొండ సభకు ప్రజల నుంచి కనీవినీ ఎరుగని రీతిలో స్పందన వచ్చింది. బహిరంగ సభలో కేసీఆర్‌ను చూడగానే ప్రజలు ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. కేసీఆర్‌పై కాంగ్రెస్ నేతలు అడ్డగోలు విమర్శలు, దూషణలకు పాల్పడడాన్ని ఎవరు కూడా తట్టుకోలేక పోతున్నారు. ఈ సభ ద్వారా కేసీఆర్ ప్రజలకు వాస్తవాలను తెలియజేయడమే కాకుండా.. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టారు.*

**- అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ మంత్రి.**



జైపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద చిన్నారితో మాట్లాడుతున్న కలెక్టర్

# పోషకాహార పంపిణీ పకడ్బందీగా నిర్వహించాలి

### కలెక్టర్ బదావత్ సంతోష్

జైపూర్, ఫిబ్రవరి 13: జిల్లా సంక్షేమశాఖ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు పోషకాహార పంపిణీని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం మండలంలోని జైపూర్ 1, దుబ్బపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల అధికారి చిన్నయ్యతో కలసి ఆకస్మకంగా సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ హాజరు నమోదు తప్పనిసరన్నారు. గర్భం దాల్చిన మహిళల వివరాలను సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రసవం తర్వాత బాలింతలు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలు, ఆహార నియమాలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, అదనపు చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి హేమసత్య పాల్గొన్నారు.

# అటవీశాఖలో అవినీతి 'కొండ'

## గోయగాం అడవుల్లో పెద్ద సంఖ్యలో టేకు చెట్ల నరికి వేత

- కలప అక్రమ రవాణా వెనుక ఉన్నతాధికారి హస్తం
- తరలింపునకు సిద్ధంగా వందలాది దుంగలు
- పట్టించుకోని పై అధికారులు



స్మగ్లర్లు తరలించేందుకు సిద్ధంగా టేకు దుంగలు



గోయగాం అడవుల్లో స్మగ్లర్ల వేటుకు గురైన టేకు వృక్షాలు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/వాంకిడి, ఫిబ్రవరి 13 : వాంకిడి మండలం గోయగాంలో దట్టమైన అడవులుండగా, స్మగ్లర్లు తిష్టవేసి అక్రమ దందా సాగిస్తున్నారు. ఎలాంటి భయం లేకుండా భారీ టేకు వృక్షాలను నరుకుతున్నారు. అక్కడే వందలాది దుంగలను తయారు చేసి తరలించేందుకు సిద్ధం చేస్తున్నారు. నేషనల్ హైవేకు ఆనుకొని ఉన్న ఈ అడవుల్లో స్మగ్లర్లు పట్టపగలే టేకు చెట్లను నరుకుతున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో అటవీశాఖలో పనిచేసే ఓ ఉన్నతాధికారి పాత్ర ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాలుగైదు నెలల క్రితం ఈ అడవుల్లో తనిఖీలు చేసిన అధికారులు అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న కొన్ని టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో కొన్ని రోజులు స్తబ్ధుగా ఉన్న స్మగ్లర్లు మళ్లీ రంగంలోకి దిగి.. కలపను తరలిస్తున్నారు.

### పశువులు కాపరులతో...

అడవుల్లో సాధారణ వ్యక్తుల్లా తిరిగే స్మగ్లర్లు.. పశువులను మేపేందుకు వచ్చే కాపరులకు రూ. రెండు మూడు వందలిచ్చి వారితోనే చెట్లు నరికివేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. వారితోనే కలప రవాణాకు అనువుగా ఉండే విధంగా దుంగలు తయారు చేయిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా రాత్రివేళల్లో హైవే మీదుగా వాహనాల్లో హైదరాబాద్ వరకు తరలిస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో తరలించేందుకు వందలాది దుంగలుండడం గమనార్హం.



గోయగాంలో నాలుగు నెలల క్రితం అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న కలప

### అధికారి కనుసన్నల్లోనే..

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అడవులు రోజురోజుకూ అంతరించిపోతున్నాయనే సందేహం కలుగుతోంది. ఏళ్లుగా ఇక్కడే పాతుకుపోయిన ఓ ఉన్నతాధికారి కనుసన్నల్లోనే స్మగ్లర్ల ద్వారా కలప రవాణా జరుగుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. సదరు అధికారి.. ఎక్కడైనా కలప పట్టుబడితే కింది స్థాయి ఉద్యోగులను బాధ్యులను చేస్తూ.. వారిపై చర్యలు తీసుకుంటాడనే ఆరోపణలున్నాయి. తనకు అనుకూలమైన కలప స్మగ్లర్లకు ఈ అధికారి కొండంత అండగా నిలుస్తాడనేది బహిరంగ రహస్యమేనని అటవీశాఖలో చర్చసాగుతోంది. ఆ అధికారికి అనుకూలమైన స్మగ్లర్లను పట్టుకుంటే తర్వాత తమకు ఇబ్బందులు వస్తాయని భావిస్తున్న కందిస్థాయి సిబ్బంది చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. అడవుల్లో క్షేత్రస్థాయిలో నిఘా పెట్టే కిందిస్థాయి అటవీ సిబ్బంది ఎప్పుడు.. ఎక్కడి అడవుల్లో సంచరిస్తున్నారనే సమాచారాన్ని ఆ అధికారే స్మగ్లర్లకు చేరవేస్తున్నట్లు సమాచారం. నేషనల్ హైవేకు ఆనుకొని ఉన్న అడవుల్లోనే ఇంత పెద్ద మొత్తంలో కలప రవాణా జరుగుతుండగా, పై అధికారులు పట్టించుకోకపోవడం అనేక సందేహాలకు తావిస్తున్నది.

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

దండేపల్లి, ఫిబ్రవరి13 : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. దండేపల్లి మండలంలోని మేదరిపేట గ్రామ పంచాయతీని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణా నిర్వాహకులకు ప్లాస్టిక్ నివారణ గురించి అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పలు దుకాణాల్లో ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఆరుబయట చెత్త వేస్తున్న దుకాణా యజమానులకు హెచ్చరిక నోటీసులు అందించాలని, అయినా మారని వారికి జరిమానా విధించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీవో శ్రీనివాస్, జీపీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఎంపీడబ్ల్యూ సతీష్, లింగయ్య, తదితరులు ఉన్నారు.



మేదరిపేటలో దుకాణాదారులతో మాట్లాడుతున్న డీపీవో

## విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

ఆసిఫాబాద్,ఫిబ్రవరి 13 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్హతతో సంబంధం లేకుండా కామన్ సర్వీస్ సెంటర్‌లో ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి 5 నుంచి 7 రోజుల ప్రాథమిక నైపుణ్యం, 15 రోజుల అధునాతన నైపుణ్య శిక్షణ ఇస్తూ రోజుకు రూ. 500 భృతి ఇస్తారని, శిక్షణ పూర్తయినత తర్వాత రూ. 15 వేల టూల్ కిట్, ధ్రువీకరణ పత్రం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమలశాఖ అధికారి రఘు, జిల్లా పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, మెప్మా ప్రాజెక్టు అధికారి మోతీరామ్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ హనుమంతరావు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, కామన్ సర్వీస్ సెంటర్ జిల్లా సమన్వయకర్త రోహిత్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ సహదేవరావు








కేస్లాపూర్ నాగోబా జాతరకు తరలివస్తున్న ప్రజలు

# నాగోబా జనసంద్రం

### కేస్లాపూర్‌కు పోటెత్తిన భక్తజనం

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 13 : కేస్లాపూర్ నాగోబాను దర్శించుకోవడానికి ఆయా ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. ఉమ్మడి జిల్లాతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో రావడంతో పరిసర ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి. దర్శనం కోసం గంటల కొద్దీ బారులుతీరారు.

### సంప్రదాయబద్ధంగా మండగాజిలింగ్ పూజలు

నాగోబా ఆలయ ఆవరణలో మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో మండగాజిలింగ్ పూజలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముందుగా నాగోబాతోపాటు సతీదేవతలకు భక్తులు వేసిన కానుకల(పావుడి డబ్బులు)ను పటేల్ కిత్త, కటోడ కిత్త, పర్ధాంజీ కిత్తలవారీగా డబ్బులను పంచుకున్నారు. అనంతరం ప్రసాదంతోపాటు కొబ్బరికాయలు, ప్రమిదలు, మట్టికుండలను మెస్రం వంశీయులతోపాటు వారి దగ్గరి బంధువులకు పంపిణీ చేశారు. మహాపూజలకు వాడిన మట్టి కుండలను కూడా 22 కితలకు చెందిన వారికి పంపిణీ చేశారు.

### బేతాల్‌దేవతకు పూజలు

బేతాల్‌దేవతకు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. మెస్రం వంశీయుల పీఠాధిపతి వెంకట్‌రావ్‌పటేల్ కాగడాలను వెలిగించి, బేతాల్ పూజలను ప్రారంభించారు. బేతాల్‌దేవత పేరిట సంప్రదాయ పద్ధతిలో నేలపై తంబాకు వేసి అక్కడి నుంచి నాగోబాను మొక్కుకున్నారు. అనంతరం సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ నృత్యాలు చేస్తూ గోవాడ్‌కు చేరుకున్నారు. గోవాడ్ పక్కన పటేల్ గది ఏర్పాటు చేసి, బేతాల్‌దేవత పూజలపై మెస్రం వంశీయులతోపాటు మహిళలకు వేర్వేరుగా పర్ధాంజీ మెస్రం దాదారావ్, నాగోబా పేన్ కొత్వాల్ మెస్రం తిరుపతి వివరించారు. గోవాడ్ ఎదుట మెస్రం వంశీయుల మహిళల ఆధ్వర్యంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి వెంకట్‌రావ్‌పటేల్ చేతి కర్రతోపాటు పెద్దల పాదాలను నీటితో కడిగా రు. మహిళలు, పురుషులు వేర్వేరుగా బేతాల్ నృత్యాలు చేశారు. తరువాత మెస్రం వంశీయులు అక్కడి నుంచి నాగోబాను దర్శించుకొని పూజలతోపాటు సంప్రదాయ పూజలకు ముగింపు పలికారు. సాయంత్రం కేస్లాపూర్ నుంచి కుటుంబ సమేతంగా ఎడ్లబండ్లతో ఉట్నూర్ మండలంలోని శ్యామ్‌పూర్ గ్రామంలోని భుడుందేవు జాతర పూజల కోసం బయలుదేరారు.



పూర్వ విద్యార్థులతో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

# అ'పూర్వ' సమ్మేళనం

### ఎమ్మెల్యే హరీశ్‌బాబును సన్మానించిన విద్యార్థులు

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 13 : పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం హైదరాబాద్‌లో సోమవారం రాత్రి నిర్వహించారు. సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరుకాగా, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అప్పటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. కుటుంబ సమేతంగా ఆనందంగా గడిపారు. తమతో పాటు చదువుకున్న పాల్వాయి హరీశ్‌బాబు ఎమ్మెల్యేగా గెలుపొందడం గొప్ప విషయమని కొనియాడారు.


